కాంట్రాక్టు అధ్యాపకులకు అందని వేతనాలు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు గత రెండు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పరుశరామ్ మాట్లాడుతూ..ప్రతినెల 1న రెగ్యూలర్ అధ్యాపకులతో పాటు కాంట్రాక్టు అధ్యాపకులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలున్నా ఓయూ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ కాంట్రాక్టు అధ్యాపకులకు సెప్టెంబర్ 8వ తేదీ వచ్చినా వేతనాలు చెల్లించడం లేదన్నారు. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి జూన్ నెల నుంచి వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. సకాలంలో జీతాలు చెల్లించాలని ఓయూ అధికారులకు పలు మార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

అంబేడ్కర్‌కు జ్ఞానమాల



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

లాలాపేట: తార్నాక చింతల్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం చింతల్ బస్తీ నాయకులు జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దళిత బహుజనుల్లో నిత్యం అంబేడ్కర్ స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతోనే ప్రతివారం అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతల్ లక్ష్మణ్, టి. హరిబాబు, మనోహర్, ప్రసన్న పాల్గొన్నారు.

పురస్కారం ప్రదానం



అవార్డు అందుకుంటున్న రాజేశ్వరి

సికింద్రాబాద్: భారత వికాస పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆదివారం సీతాఫల్‌మండికి చెందిన ఉపాధ్యాయురాలు ఆర్ రాజేశ్వరి ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం అందుకున్నారు. సీతాఫల్‌మండిలోని మాథుర్ విద్యాలయ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరిని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసిన వికాస పరిషత్ నిర్వాహకులు గురువందన స్ఫూర్తి అవార్డును ప్రదానం చేసి సత్కరించారు.

నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ సారా

అడ్డగుట్ట: దివ్యాంగులు, నిరుపేద ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని సెవెన్ రేస్ ఫౌండేషన్ చైర్మన్ సారా అన్నారు. అడ్డగుట్ట డివిజన్‌లోని మారేడ్‌పల్లి మండల కార్యాలయం సమీప ప్రాంతానికి చెందిన మితాబ్ అనే దివ్యాంగుడికి ఆమె ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సెవెన్ రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా దివ్యాంగులు, నిరుపేద ప్రజలకు సహాయం అందిస్తున్నామని, అదే విధంగా కొందరు పేద విద్యార్థుల చదువులకు కూడా తమ వంతుగా సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు.

సంప్రోక్షణ తర్వాతే దర్శనానికి అనుమతి

నల్లకుంట: చంద్రగ్రహణం నేపథ్యంలో న్యూ నల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి ఆలయాన్ని మూసేస్తున్నట్లు ఆలయ ఈవో కె. జయంతి తెలిపారు. సోమవారం(నేడు) ఉదయం ఆలయ సంప్రోక్షణ చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పారు. అదే విధంగా నల్లకుంటలోని శంకరమఠం, పాతరామాలయం, లింగాలగడ్డ శివాలయం, తిలక్‌నగర్ శివాలయం, బాగ్‌అంబర్‌పేటలోని శ్రీ షిరిడీసాయిబాబా మందిరం, అహోబిలమఠం తదితర ఆలయాలను మూసేశారు. తిరిగి సోమవారం ఉదయాన్నే ఆలయాల సంప్రోక్షణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.

చిక్కడపల్లి: చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి, వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయాలతో నియోజకవర్గంలోని ఆలయాలను మూసేశారు. సోమవారం ఉదయం 6గంటలకు ఆలయాలను తెరచి సంప్రోక్షణ చేసి శుద్ధిచేస్తామని ఆలయాల చైర్మన్‌లు, ఈఓలు తెలిపారు.

వన మహోత్సవం.. ప్రచారానికే పరిమితం

- నామమాత్రంగా మొక్కల పంపిణీ
- నర్సరీలు మాత్రం ఖాళీ
- సికింద్రాబాద్‌లో నీరుగారిన చెట్లు నాటే కార్యక్రమాలు



సికింద్రాబాద్‌లోని నర్సరీలో మొక్కలు లేని దృశ్యం

సికింద్రాబాద్: వర్షాకాలంలో విరివిగా వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించించి పచ్చదనాన్ని నింపాలన్న జీహెచ్ఎంసీ లక్ష్యం సికింద్రాబాద్‌లో నీరుగారిపోయింది. ఈ ప్రాంతంలో ప్రత్యక్ష, పరోక్షంగా లక్ష మొక్కలు నాటాలన్న లక్ష్యం ప్రచారానికే పరిమితమైంది. ఈ ఏడాది జూలై 9న సికింద్రాబాద్‌లో జీహెచ్ఎంసీ అధికారులు ప్రారంభించి వన మహోత్సవ కార్యక్రమాలు అంతగా సఫలం కాలేదు. అయితే మొక్కలు నాటే కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసి నాటిన మొక్కలను సంరక్షించే విధంగా చర్యలు తీసుకునేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు.

లక్ష్యం 50 వేల మొక్కలు..

సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో మొత్తంగా 50 వేల మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం పార్కులు, కాలనీలు, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణల స్థలాలను ఎంపిక చేసుకున్నారు. డివిజన్ల వారీగా వనమహోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆయా ప్రాంత ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సహకారం తీసుకునేందుకు కసరత్తు చేశారు. ఇందుకోసం సికింద్రాబాద్ ప్రాంతంలోని రెండు సర్కిళ్ల పరిధిలో మొక్కలు సిద్ధం చేసుకున్నారు. ఇంటి ముందు, లోపల ప్రజలు మొక్కలు నాటుకునేందుకు నిమ్మ, దానిమ్మ, కరివేపాకు, జామ, అల్లనేరేడు మొక్కలను పంపిణీ చేయనున్నట్టు, వేప, రావి, బాహునియా, చింత, అల్లనేరేడు, కానుగ, బాదాం చెట్లను రహదారులు, ప్రభుత్వ స్థలాల్లో నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు.

బోనాల పంపిణీతో సరి..

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నియోజకవర్గం పరిధిలోని ఐదు డివిజన్లలో ఎక్కడా అధికారులు వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించలేదు. డివిజన్‌కు ఆరువేల మొక్కల చొప్పున పంపిణీ చేసామని అధికారులు ప్రకటించినా ఎక్కడా పంపిణీ చేసినట్టు తమకు సమాచారం లేదని కార్పొరేటర్లు పేర్కొంటున్నారు. నగరంలో బోనాల జాతర జరిగిన సందర్భాల్లో మాత్రం ఐదు డివిజన్లలో కలిపి వందల సంఖ్యల్లోని మొక్కలు పంపిణీ చేసిన జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారులు ఆ తర్వాత ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు.



బోనాల సందర్భంగా మొక్కల పంపిణీ (ఫైల్)

నర్సరీలు ఖాళీ..

ఐదు సర్కిళ్ల పరిధిలో తొలి విడత వనమహోత్సవ కార్యక్రమాల కోసం 50 వేల మొక్కలను రెండు నర్సరీల్లో సిద్ధంగా ఉంచినట్టు జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారులు పేర్కొన్నారు. ముదస్తుగా ప్రభుత్వ స్థలాలు, మైదానాలు, ప్రభుత్వ కార్యాలయాలను ఇప్పటికే ఎంపిక చేసినట్టు చెప్పారు. ఇందులో నాటేందుకు 30 వేల మొక్కలు వినియోగిస్తామన్నారు. మరో 20 వేల చిన్న తరహా మొక్కలను ప్రజలకు పంపిణీ చేయడం కోసం సిద్ధంగా ఉంచామని చెప్పారు. వర్షాకాలం త్వరలో పూర్తి కావస్తున్నా ఎక్కడా మొక్కలు నాటినట్లు పంపిణీ చేసిన దాఖలాలు లేవు.అయితే సికింద్రాబాద్ ప్రాంతంలోని నర్సరీల్లో ఎలాంటి మొక్కలు లేవు.మొక్కల పంపిణీ ప్రక్రియ పూర్తయిందని, మిగతా మొక్కలను నర్సరీల నుంచి ఇతర సర్కిళ్లకు పంపించామని హార్టికల్చర్ అధికారులు చెబుతుండడం గమనార్హం.

వెయిట్ లిఫ్టింగ్ లీగ్ ప్రారంభం

లాలాపేట: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్, తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అస్మిత వెయిట్ లిఫ్టింగ్ లీగ్–2025–26 ఆదివారం లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా అస్మిత కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో సీనియర్, జూనియర్ విభాగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 80 మంది పాల్గొన్నారు. ఈ లీగ్‌లో అర్హత సాధించిన ఆటగాళ్లు త్వరలో బెంగళూరులో జరుగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు సీనియర్ అడ్వకేట్ తిరుపతయ్య పాల్గొని విజేతలకు పతకాలు అందజేశారు.



బరువు ఎత్తుతున్న క్రీడాకారిణి

ప్రశాంతంగా నవరాత్రి వేడుకలు

ఏసీపీ శశాంక్‌రెడ్డి

సికింద్రాబాద్: చిలకలగూడ సబ్‌డివిజన్ పరిధిలో ప్రశాంతంగా గణపతి నవరాత్రి వేడుకలు పూర్తి చేశామని ఏసీపీ కే.శశాంక్‌రెడ్డి చెప్పారు. నవరాత్రి వేడుకల బందోబస్తు కోసం వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు బలగాలకు ఆదివారం వీడ్కోలు కార్యక్రమం జరిగింది. అనంతరం ఏసీపీ శశాంక్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. వారాసీగూడ, చిలకలగూడ, లాలాగూడ పీఎస్‌ల పరిధిలో ఆయా పోలీస్‌స్టేషన్ల హౌజ్ ఆఫీసర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ల సహకారంతో తొలిరోజు గణపతి మండపాల్లో విగ్రహాల ప్రతిష్టాపనలు మొదలు నిమజ్జనం వరకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. డివిజన్ పరిధిలోని మండపాల నిర్వాహకులతో వేడుకలకు పీస్‌క మిటీ సమావేశాలు ఏర్పాటు చేయడం మొదలు నిమజ్జనం వరకు వారికి సలహాలు సూచనలు ఇవ్వడం ద్వారా అన్ని కార్యక్రమాలు ప్రశాంతంగా ముగించామన్నారు.



పోలీసు బలగాలకు వీడ్కోలు పలుకుతున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ విద్యార్థులు

లాలాపేట: బంజారా, లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ స్టూడెంట్ ఫోరం అధ్యక్షుడు భట్టు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదివాసీ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఐక్యతను చాటేలా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలస, చొరబాటుదారులు నేడు తెలంగాణ సమాజాన్ని పట్టి పీడిస్తున్నారని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఆదివాసీలకు రావాల్సిన అన్ని అవకాశాలను లంబాడీలు, బంజారాలు తీసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని నేడు వారే తమ అస్థిత్వాన్ని సైతం దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మహేందర్, పాపారావు,సాగర్, జీవన్, లక్ష్మీపతి,అనిరుధ్, అఖిల్, సౌజన్య, సంధ్య, సరిత తదితరులున్నారు.

ఉన్నతులుగా తీర్చిదిద్దే వారే గురువులు

చిక్కడపల్లి: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే వారే గురువులని యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఆదివారం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'భారత్ ఐకాన్ – ఉత్తమ ఉపాధ్యాయ'పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణకు ఎంపికైన ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యతో పాటు వివిధ నైపుణ్యాలను అందించేది ఉపాధ్యాయులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారి, ప్రముఖులు చక్రపాణి, దామోదర్, నాగేంద్ర, భరతనాట్య గురువు రాగరంజని, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భరతనాట్య గురువు రాగరంజనిని సన్మానిస్తున్న లంకా లక్ష్మీనారాయణ

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలి



ఫీజు బకాయిలను విడుదల చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న జాతీయ బీసీ మహాసభ నేతలు

కాచిగూడ: విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఫీజు బకాయిలు చెల్లించాలని ఆదివారం కాచిగూడ, నింబోలిఅడ్డ సర్కిల్‌లో బీసీ నేతలతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌పటేల్‌గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థులకు ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో ఉజ్వలమైన భవిష్యత్ ఉన్న యువత, విద్యార్థులు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్ అంధకారంగా మారుతోందని అన్నారు. విద్యార్థుల ఫీజుబకాయిలు రూ.4,300 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని స్కాలర్‌షిప్స్ రూ.15వేల వరకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణ, భూషణ్, భాస్కర్, ముత్యాల్‌రావు, ప్రశాంత్ నిమ్‌కర్, సత్యపాల్ సింగ్, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.23, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 53, పచ్చకాకర 27, పందిరి బీర 41, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 40, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 45, కందగడ్డ 40, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 3–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆలయాల మూసివేత



మూసివేసిన మహంకాళి దేవాలయం

రాంగోపాల్‌పేట్: చంద్రగ్రహణం సందర్భం ఉజ్జయినీ మహంకాళి దేవాలయం, సికింద్రాబాద్ గణపతి దేవాలయం, ఎస్పీరోడ్ హనుమాన్ దేవాలయం, పెరుమాళ్ వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు వివిధ దేవాలయాలను మూసివేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి అన్ని ఆలయాలను మూసివేశారు. సోమవారం శుద్ధి అనంతరం భక్తులకు ప్రవేశం ఉంటుందని అధికారులు తెలిపారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం



కవాడిగూడ: రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాచరణ రూపొందించామని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆదివారం దోమలగూడలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. నగరంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. మొదటి విడతలో 50 వేల సభ్యత్వాలే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీని ప్రజలకు చేరువ చేసేలా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ త్వరలో సభ్యత్వ నమోదు ఎలా చేయాలనే దానిపై నిర్ణయాలు తీసుకుంటుదని తెలిపారు. ఈ సమావేశంలో ఆప్ నగర నేతలు మహమ్మద్ మజీద్, హేమ, సుదర్శన్, సాదిఖ్, శివాజీ, రమ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి



చెట్లు నరికేసిన దృశ్యం

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని లాలాపేట ప్రొ. జయశంకర్ స్టేడియంలో దాదాపు 40 ఏళ్ల నాటి రెండు వేప చెట్లను నరికివేశారు. గతంలో ఇదే ప్రాంతంలో ఉన్న పలు తాటి చెట్లు సైతం నరికివేశారు. స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి అడ్డుగా ఉన్నాయంటూ నాలుగు దశాబ్దాల కాలం నాటి చెట్లను నరికి వేసి వేర్లతో సహా తొలగించారు. ఇలా చెట్ల నరికివేతతో పర్యావరణానికి విఘాతం కలుగుతోందని పర్యావరణ వేత్తలు, స్టేడియం వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు ప్రభుత్వాలు చెట్లు నాటే కార్యక్రమాల పేర్లతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఏపుగా పెరిగిన వేప చెట్లు నరికివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లాలాపేటవాసులు డిమాండ్ చేస్తున్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

బౌద్ధనగర్: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఇందిరా పార్కు వద్ద జరగనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని టీయూజేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎస్. యాదగిరి పిలుపునిచ్చారు. ఆదివారం వారాసిగూడ చౌరస్తాలో ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇస్తామని చెప్పిన 250 గజాల స్థలం, 25 వేల పెన్షన్, 100 ఎకరాల్లో అమరులకై స్మృతి వనం, 25 లక్షల సామాన్య, ప్రమాద బీమా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో మహాధర్నాను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. భాగయ్య, గుండా యాదగిరి, పాండు, జనార్దన్, రమేష్, మల్లేష్, సీ. యాదగిరి, సాయిబాబా, గణేష్, లక్ష్మణ్, శంకర్, యాదమ్మ పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటే మంచి అవకాశాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏ రంగాన్ని ఎంపిక చేసుకుంటామో ఆ రంగంలో నైపుణ్యం సాధిస్తే వారికి మంచి అవకాశాలు లభిస్తాయని ప్రముఖ విద్యావేత్త టి. గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలోని అరోరా డిగ్రీ, పీజీ కళాశాలలో జీవితంలో విజయవంతం కావడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో అమెరికా నుంచి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోపాలకృష్ణ మాట్లాడుతూ.... విద్యార్థులలో సృజనాత్మకత ఉండాలన్నారు. ముఖ్యంగా ఉన్నత లక్ష్యంతో పాటు క్రమశిక్షణ, సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకుంటే వారు అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని చెప్పారు. విజయవంతం కావాడానికి ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమని తన అనుభవాలను ఉదాహరణతో వివరించారు. మనం వెళ్లే దారిలో అనేక సవాళ్లను ఎదుర్కొవాల్సి వస్తుందని వాటిని అధిగమించినప్పుడే విజయానికి చేరుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. అజయ్ కుమార్, కోఆర్డినేటర్ డా. మీరాజోషి, సైన్స్ విభాగాధిపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రముఖ విద్యావేత్త టి. గోపాలకృష్ణ

'రాగ బాల శతకం' పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు, కవయిత్రి డాక్టర్ సూర్యదేవర రాధా రాణి రచించిన 'రాగ బాల శతకం'పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శింగిణి స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డా. భూపాల్ మాట్లాడుతూ... చిన్న పిల్లల నోట పలికే భాషలో ఈ పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమని అన్నారు. పిల్లలు, పెద్దలు, ఉపాధ్యాయులకు చెందే పద్యాలను చందోబద్ధమైన ఆటవెలది పద్య రూపంలో రచించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఎస్.రఘు, డా. వీఆర్. శర్మ, డా. ఉప్పల పద్మ, డా. సూర్యదేవర జతిన్‌కుమార్, డా. సింధుజ, బేబీ రాగ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ముగిసిన వినాయక నిమజ్జనాలు



బాణాసంచా వెలుగుల్లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

చిలకలగూడ: వివిధ మండపాల్లో కొలువుదీరి విశేష పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జన వేడుకలు, శోభాయాత్రలు చిలకలగూడ ఠాణా పరిధిలో ప్రశాంతంగా కొనసాగాయి.శనివారం రాత్రి ప్రారంభమై ఆదివారం వేకువజాము వరకు కొనసాగాయి. విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనాల్లో లంబోదరుడిని నిమజ్జనానికి తరలించారు. చిలకలగూడ మున్సిపల్ మైదానంలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన నీటి కుంటల్లో 761 పీఓపీ,481 మట్టి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. భారీ విగ్రహాలు ట్యాంకుబండ్, ఏడుపాయలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ తదితర ప్రాంతాలకుప్రత్యేక వాహనాల్లో తరలించారు. మైలార్‌గడ్డ నుంచి చిలకలగూడ చౌరస్తా వరకు ఏర్పాటు చేసిన స్వాగత వేదికల నుంచి నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడిపై పూలవర్షం కురిపించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి ఆదేశాల మేరకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని సీఐ అనుదీప్ తెలిపారు.



టీఆర్ఎస్ నాయకుడు వంజరి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నిర్వాహకులు



బందోబస్తు విధుల్లో ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్

లడ్డూ వేలం

లాలాపేట: గణేష్ ఉత్సవాల సందర్భంగా తార్నాక విజయపురి కాలనీలో స్వస్తిక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంలో హబ్సిగూడకు చెందిన సాయి, ఉప్పల్‌కు చెందిన కట్ట శివ రెడ్డి రూ. 4 లక్షలకు లడ్డూ దక్కించుకున్నారు.

